క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, మాథమేటిక్స్‌లో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి శుక్రవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీలో 55 శాతం మార్కులు పొంది ఉండాలని, యూజీసీ నెట్, స్టేట్ స్లెట్, పీహెచ్‌డీ అర్హత గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవి తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాను మే 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 75693 27277/99591 08829 సంప్రదించాల్సిందిగా తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జి.కొండూరు: స్థానిక హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలు జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. ఈ పనులను పరిశీలించిన ఎంపీపీ మాట్లాడుతూ త్వరలో శ్మశానం చుట్టూ గోడ నిర్మించి, షెడ్డును కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కందుల యేసురాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ వేములకొండ విష్ణు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

మైలవరం: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సీ)అనుసరించి 2023–24 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు కల్పించాలని విద్యాశాఖ నిర్ణయించిందని ఎంఈవో రత్నశ్యామ్‌బాబు శుక్రవారం తెలిపారు. రెండో విడత విద్యార్థుల దరఖాస్తులు స్వీకరణ గడువు పొడిగించినట్లు తెలిపారు. మే 6 నుంచి 15 వరకు విద్యార్థులు దరఖాస్తుచేసుకునేందుకుకంప్యూటర్‌లో పోర్టల్ ఓపెన్‌లో ఉంటుందన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా విద్యార్థుల దరఖాస్తులు ఎలిజిబిలిటీ ధ్రువీకరణ తేదీ మే 16 నుంచి 20 వరకు, లాటరీ లిస్టును మే 22 ప్రదర్శిస్తారన్నారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహాభాష అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా వేసవిలో జాగ్రత్తలపై పాఠశాలల్లో కరపత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. వడదెబ్బ వలన శరీరంలో నీటిశాతం తగ్గి విరోచనాలు, వాంతులు, తలనొప్పి వచ్చి నీరశించిపోతారని ఆయన తెలిపారు. కొన్ని సమయాల్లో ప్రాణాపాయం కలగవచ్చన్నారు. వడదెబ్బ రక్షణకు కాటన్‌దుస్తులు ధరించాలని, టోపీ, గొడుగు వంటివి వాడాలని తెలిపారు. కొబ్బరి నీళ్ల, మజ్జిగ తీసుకోవాలన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ షీనాబేగం, ఎంఏ.బేగ్, ప్రోగ్రాం అధికారులు మస్తాన్‌వలి, నాగుల్ మీరా, జాఫర్ షరీఫ్, అడ్వకేట్ సుధాకర్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో 81 శాతం ఉత్తీర్ణత

రెడ్డిగూడెం: ఇంటర్ పబ్లిక్ పరీక్షలో 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రంగాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తబిత శుక్రవారం తెలిపారు. మండలంలోని రంగాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో బైపీసీ గ్రూపులో పడిశాల ప్రవళిక 959 మార్కులతో ప్రథమస్థానంలో, ఎంపీసీ గ్రూపులో పడిశాల శ్రుతి 921 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో మిరియాల సుష్మిత 448 మార్కులతోను, బైపీసీ గ్రూపులో బండారు వెంకటరమణ 408 మార్కులతో ప్రథమ స్థానంలో నిచిలిచినట్లు ప్రిన్సిపాల్ తబిత తెలిపారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ మేరీ ప్రశాంతి



ఆగిరిపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఆగిరిపల్లి: జిల్లాలో శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత పలు పోలీస్ స్టేషన్ల సందర్శనలో భాగంగా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఎస్పీ పరిశీలించారు. భవన నిర్మాణం బాగుందని కితాబిచ్చారు. పోలీస్ స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళలు, చిన్నారుల సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది చొరవ చూపాలన్నారు. సిబ్బందితో, మహిళా పోలీసులతో మాట్లాడి వారి సాధక బాధలు తెలుసుకున్నారు. నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, నూజివీడు రూరల్ సీఐ అంకబాబు, ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్‌లో..

నూజివీడు: పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఏలూరు ఎస్పీ డీ మేరీ ప్రశాంతి సందర్శించారు. స్టేషన్ భవనాన్ని, పరిసరాలను పరిశీలించిన ఆమె అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, మహిళా పోలీసుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అసాంఘిక శక్తుల కదలికలను గమనించాలన్నారు. జూదాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్, సీఐ రాజులపాటి అంకబాబు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

తిరువూరు: విజయవాడ పోలీస్ కమిషనరేట్ రూరల్ డీసీపీ అజిత వేజెండ్ల శుక్రవారం తిరువూరు సర్కిల్లోని పోలీసుస్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. తొలిసారిగా తిరువూరు వచ్చిన ఆమెకు సీఐ బీమరాజు, ఎస్ఐలు సురేష్, పద్మారావు స్వాగతం పలికారు. పోలీసుస్టేషన్లలో పెండింగ్ కేసులు, పాత నేరస్తుల వివరాలను పరిశీలించారు.

విస్సన్నపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ అజిత వెజెండ్ల శుక్రవారం అకస్మిక తనిఖీ చేశారు. సామాన్య తనిఖీలో భాగంగా స్టేషన్‌ను పరిశీలించినట్లు డీసీపీ తెలిపారు. ఏసీపీ రమేష్, సీఐ ఆర్ బీమరాజు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభ్యున్నతికి ‘నవరత్నాలు’

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- నెమలిలో గడప గడపకు మనప్రభుత్వం



సమస్యలు తెలుసుకుంటున్న తిరువూరు శాసన సభ్యులు రక్షణనిధి

నెమలి(గంపలగూడెం): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న నవరత్నాలు పేద మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తున్నాయని తిరువూరు శాసన సభ్యులు కే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం నెమలిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ పథకాల ద్వారా అందిన లబ్ధి వివరాలతో ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. కాలనీలో పలు అంతర్గత రహదారులను అభివృద్ధి పరచాలని మురుగునీరు పారుదలకు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. తగిన నిధులు కేటాయించి సమస్య పరిష్కారిస్తానని ఎమ్మెల్యే హామినిచ్చారు. కాగా కాలనీ గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. ఎమ్మెల్యే ముందుగా నెమలి వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ దుబ్బాకుల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు కుంభగిరి వెంకటకృష్ణ, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్‌కావూరి శశిరేఖ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కావూరి వినయ్ కుమార్, గోగులమూడి చెన్నకేవశరెడ్డి, చెరుకు నరసారెడ్డి, పామర్తి మల్లిఖార్జునరావు, మాజీ ఎంపీపీ కోట దాసు,నాయకులు రమేష్, వి.వైకుంఠం, మురళీ, ఊటుకూరు రాంబాబు, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- బోర్వంచలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలంలోని బోర్వంచలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి రాష్ట ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కుటుంబాలకు వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకుంటే సమస్య గుర్తించి సరిచేయాలని అధికారులను ఆదేశించారు. పలువురు మహిళలు, తమకు సున్నావడ్డీ, రుణమాఫీ అందిందని, చేయూత పథకంలో లబ్ధి పొందుతున్నామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 100 శాతం సీఎం జగన్ నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క పథకం కూడా అమలు చేయలేదని, ఏనాడూ ఎమ్మెల్యేలు గెలిచిన తరువాత మళ్లీ ప్రజల వద్దకు రాలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరూ ప్రజల్లోనే ఉంటున్నామన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ అందజేస్తోన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరలా గెలిపించుకోవాలన్నారు. సర్పంచి కుంటం ఉదయరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీడీఓ సుందరి, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఎంపీటీసీ దాడేపల్లి సునీత, సయ్యద్ సలీంపాషా ఖాద్రీ, ఉపసర్పంచి కిదర్ పాషాఖాద్రీ, మరీదు రమేష్, రాంబాబు, పామర్తి రాజా, ధనుంజయ్, ఏపీవో సోమేశ్వరి పాల్గొన్నారు.

నకిలీ బంగారం పెట్టి.. అసలు బంగారం చోరీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బంగారం కొనుగోలుకు వచ్చి.. షాపు యజమానులను బురిడీ కొట్టించిన ఘటన కొండపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. కొండపల్లి చందన జ్యూయలరీ షాపులో బుధవారం సాయంత్రం ఇద్దరు మహిళలు బంగారం కోసం వచ్చి చెవిదిద్దులు చూపించమని అడిగారు. చెవిదిద్దులు చూపించగా యజమాని కళ్లుకప్పి నకిలీ చెవిదిద్దులు అక్కడపెట్టారు. 9 గ్రాముల అసలు బంగారం చెవిదిద్దులతో జారుకున్నారు. తర్వాత రోజు షాపు యజమాని సందీప్‌కుమార్ నకిలీ చెవిదిద్దులు గమనించి మోసపోయామని గ్రహించాడు. గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ పి.శ్రీను కేసు నమోదుచేసి సీసీ టీవీ పుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

నూజివీడు: మండలంలోని ఎంఎన్‌పాలెంలో మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన చోడవరపు ఉమారాణి (47) శుక్రవారం తెల్లవారు జామున 4గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె భర్త నాగ వెంకటపూర్ణ రంగారావు రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9440796440కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి సన్మానం



క్రీడాకారిణి దీపికను, కోచ్ అంజిబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, స్థానికులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థిని, కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి దాసరి దీపిక ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో శుక్రవారం హైస్కూల్లో ఆమెను ఘనంగా సత్కరించారు. మే 10 నుంచి 20 వరకు నేపాల్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ అంజిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, గొల్లపల్లి ఉపసర్పంచి రెడ్డి మధుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రంగారావు కలిసి రూ.5వేలు, హైస్కూల్లో గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రస్తుతం పనిచేస్తోన్న ఉపాధ్యాయులు కలిసి రూ.8వేలు, క్రీడాకారిణి దీపికకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మట్లాడుతూ ఇంటర్నేషనల్ పోటీల్లో ప్రతిభను కనబరిచి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, మల్లేశ్వరి, పద్మ, సుశీలకుమారి, మనోహరం, పీడీ రవీంద్ర పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు తదితరులు

మైలవరం: విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు సర్నాల తిరుపతిరావు తెలిపారు. మైలవరంలోని శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో వివిధ అంశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. విద్యా పరంగా ఈ పాఠశాలలో గిరిజన, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి యాజమాన్యం చేస్తున్న కృషిని తిరుపతిరావు అభినందించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సలహాదారుడు సుంకర సత్యనారాయణ మాట్లాడారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా భగీరథుని జయంతి

ఆగిరిపల్లి: కొమ్మూరులో భగీరథుని జయంతిని గురువారం రాత్రి సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుని చిత్ర పటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పోత్రు రామారావు, వార్డు సభ్యుడు పోత్రు రామారావు, కృష్ణవరం సొసైటీ ఉపాధ్యక్షులు పోత్రు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కొనసాగుతున్న ‘జగనన్నే మా భవిష్యత్తు’

వావిలాల (తిరువూరురూరల్): మండలంలోని వావిలాలలో శుక్రవారం ‘జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, మండల జేసీఎస్ చైర్మన్ గుడిపూడి నారాయణరావు,వావిలాల పీఏసీఎస్ చైర్మన్ కొమ్మినేని కిషోర్ గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందుతున్న పథకాల వివరాలను తెలియజేశారు. లబ్ధిదారుల ఫీడ్ బ్యాక్ నమోదు చేశారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశం

ముసునూరు: అధికారులకు సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష రాజేంద్రన్ పిలుపు నిచ్చారు. తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన శుక్రవారం రాత్రి చింతలవల్లి గ్రామ సచివాలయం వద్ద రాత్రి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్ గ్రామ సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎస్సీ ఏరియాల నుంచి పొలాల్లోకి వెళ్లే నాలుగు రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఆర్.ఐ మాధవ సాయిరామ్, వీఆర్వో హరి బాబు, సచివాలయసిబ్బంది, వలంటీర్లుపాల్గొన్నారు.

అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నూజివీడు: మండలంలోని అన్నవరంలోని పెట్రోలు బంకు వద్ద పశువుల అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన మందపాటి మత్రావు (35)కు గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో తన కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై నూజివీడు వెళ్తుండగా వెనుక నుంచి అంబులెన్స్ ఢీకొంది. గాయపడిన మత్రావును నూజివీడు ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

మునుకుళ్ళ(తిరువూరు రూరల్): భారతదేశంలో అత్యధిక జనాభా మాట్లాడే హిందీభాషను విద్యార్థులు ఇష్టంతో నేర్చుకోవాలని హిందీ సంఘ్ అధ్యక్షుడు రేపాక రఘునందన్‌అన్నారు. మునుకుళ్ళజెడ్పీ ఉన్నత పాఠశాలలోదక్షిణ భారత హిందీప్రచార సభ నిర్వాంచిన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. హెచ్ ఎం బీ వీరభద్రరావు పాల్గొన్నారు.

కార్యదర్శులు పనితీరు మెరుగుపరుచుకోవాలి

నూజివీడు: పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ గ్రేడ్–5 సెక్రటరీలు పనితీరును మెరుగుపరుచుకోవాలని ఎంపీడీవో సుందరి అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్–5 సెక్రటరీలకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలందరికీ ఆధార్ అప్‌డేట్ చేయించాలని, ఈ విషయాన్ని వలంటీర్ల ద్వారా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈనెల 29న ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహిస్తున్నందున వారందరూ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. మండలంలో 43 మంది డ్రాపవుట్స్ ఉన్నారని, వారు ఏ ప్రాంతాల్లో ఉన్నారో తెలుసుకొని నివేదికను అందజేయాలన్నారు. 80 శాతం కంటే తక్కువ విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటే కారణాలతో నివేదికను సిద్ధం చేయాలన్నారు. మండలంలోని బత్తులవారిగూడెం సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మైలవరం: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మైలవరం మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలను, ధాన్యం రాశులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.1962 కే కొనుగోలు చేయాలని, సకాలంలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మొక్కజొన్నలు, ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఆళ్ళ అమ్మిరెడ్డి, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, నాయకులు నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

గంపలగూడెం: స్థానిక గాంధీ సెంటర్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆర్యవైశ్య సంఘం మండల శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి కొత్తగుండ్ల నరసింహారావు ప్రారంభించారు. ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహకారంతో రోజూ 60 లీటర్ల మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. మాజీ సర్పంచ్ కే సత్యబాబు, వివిధ వ్యాపార సంఘాల నాయకులు చారుగుండ్ల సుబ్బారావు, కాజా రవికుమార్, వాసవిసేవాదళ్ కన్వీనర్ చారుగుండ్ల హనుమంతరావు, అన్నవరపు క్రాంతి కుమార్, సమరసతసేవా ఫౌండేషన్ నిర్వాహకులు వనమా సుజాత, వనమా సత్యవాణి, సభ్యులు పాల్గొన్నారు. ఊటుకూరు బస్టాప్ సెంటర్లో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగ పంపిణీని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డిలు ప్రారంభించారు. వాసవి, వనిత, కన్యక క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు వీడ్కోలు

తిరువూరు: స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈసీఈ చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఇంజినీరింగ్ విద్యకు ఉన్న ప్రాధాన్యత, ఉద్యోగావకాశాలు, ఉన్నత విద్యావకాశాలను గురించి కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు వివరించారు. ఈసీఈ విభాగాధిపతి హరికృష్ణ, చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరి సుబ్రహ్మణ్యం, కరస్పాండెంటు పీ నాగేశ్వరరావు, ఏవో కిషోర్ పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

మైలవరం: విద్యార్థులు బాగా చదువుకుంటే సమాజంలో గుర్తింపు వస్తుందని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ప్రొఫెసర్ సీవీ నారాయణరెడ్డి తెలిపారు. మైలవరంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ హెబ్సిబా, డీన్ శేషుకుమార్, వైస్ ప్రిన్సిపాల్ మణీషా, రజని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డు విస్తరణకు ఆమోదం



తిరువూరు: స్థానిక మెయిన్‌రోడ్డును 60 అడుగుల మేర విస్తరించేందుకు నగర పంచాయతీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శుక్రవారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. రహదారులు, భవనాల శాఖ తిరువూరు మెయిన్‌రోడ్డును 100 అడుగుల మేర విస్తరించేందుకు ప్రతిపాదించగా, స్థానిక పరిస్థితుల దృష్ట్యా 60 అడుగులు మాత్రమే విస్తరణ చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. వేసవిలో పట్టణ ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు, మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్టీలు గ్లాసుల పంపిణీ



తిరువూరు: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవసరమైన స్టీలు గ్లాసులను స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంఈవో రామకృష్ణలు గ్లాసుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు విద్యాకానుక సామగ్రి, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

విస్సన్నపేట: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ప్రభుత్వం సరఫరా చేసిన గ్లాసులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంపీపీ మేర్సీ వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ సాధుపాటి నాగ మల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మల్లయ్య, ఎంఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.